ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

మంగళవారం | జూన్ 16, 2026 | సంపుటి : 7 | సంచిక : 16 | పేజీలు : 2

2 లో

పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రజా ప్రభుత్వం: ఎమ్మెల్యే

మెట్రో సమస్య కు..

కిషన్ రెడ్డే కారణం

కేసీఆర్‌కు ఆయన గురుదక్షిణ చెల్లిస్తున్నారు

- గత పాలనలో మెట్రో విస్తరణ ఆగింది
- రూ.15 వేల కోట్లతో పూర్తికావాల్సిన మెట్రో రైలు నిర్మాణం రూ.22 వేల కోట్లకు పెరిగింది
- మెట్రో మొదటి దశ స్వాధీనం, నిధుల సమీకరణ, రెండో దశ విస్తరణ అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్

హైదరాబాద్, ఆయుధం: మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌కు అంతర్జాతీయ సౌకర్యాలతో రవాణా సదుపాయం ఉండాలనే ఆలోచనతో గతంలో దేశంలోనే కీలకమైన హైదరాబాద్ మెట్రో రైలు నిర్మాణం గురించి చర్చ జరిగిందని గుర్తు చేశారు. రూ.15 వేల కోట్లతో పూర్తికావాల్సిన మెట్రో రైలు నిర్మాణం రూ.22 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందుగా ఉన్నాయని పేర్కొన్నారు. సెకండ్ ఫేజ్‌లో మెట్రో విస్తరణ అనుమతి కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని, ప్రతి ఏడాది రూ.400 కోట్ల నష్టం వస్తుందని ఎల్ అండ్ టీ చెప్పిందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ఒప్పుకోలేదని వివరించారు.

గ్యారెంటీ లేకుండా అప్పు

రూ.30 వేల కోట్ల ఎల్ అండ్ టీ ఆస్తులను రూ.15 వేల కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసిందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో నిర్మాణానికి కిలోమీటర్‌కు రూ.350 కోట్లు ఖర్చు అవుతుందని, ఎల్ అండ్ టీకి రూ.13,600 కోట్ల అప్పు ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు భాగస్వాములుగా ఉన్నారని, తక్కువ వడ్డీకి రుణాలు తీసుకోవాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్‌కు రూ.లక్షా 52 వేల కోట్లు అప్పుగా ఇచ్చారని, గతంలో కేసీఆర్‌కు ఆర్ఈసీ రూ.1.61 లక్షల కోట్లు అప్పులు ఇచ్చిందని, ఎలాంటి గ్యారెంటీ లేకుండా రూ.3.15 లక్షల కోట్లు అప్పుగా ఇచ్చారని తెలిపారు.

కిషన్‌రెడ్డి వల్లే..

ఐఆర్ఎఫ్‌సీ నుంచి ఎల్ అండ్ టీకి 4 శాతం వడ్డీకి రూ.13,600 కోట్ల రుణం ఇప్పించామని సీఎం తెలిపారు. బ్యాంకుల అప్పులకు రేవంత్ రెడ్డికి తేలికగా పనిచేస్తే తెలంగాణలో బీజేపీకి ఇబ్బందులు వస్తాయని కిషన్‌రెడ్డి.. ఖట్టర్, అశ్వినీకి

మిగతా 2లో..

బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

హనుమకొండ, ఆయుధం: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వాటి పరిష్కారాన్ని వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సంబంధిత శాఖల అధికారులు, పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రవి, ఏఎస్పీతో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ కేసుల పురోగతి, బాధితులకు అందుతున్న సహాయం, వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నమోదైన అట్రాసిటీ కేసుల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని ప్రాధాన్యంగా తీసుకుని విచారణలను వేగవంతం చేయాలని సూచించారు. దర్యాప్తు పూర్తయిన కేసుల్లో చార్జిషీట్లు సకాలంలో దాఖలు చేసి న్యాయ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని పోలీసు అధికారులను ఆదేశించారు. 2023 నుంచి 2026 వరకు జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల బాధితులకు ప్రభుత్వం నిబంధనల మేరకు మొత్తం రూ.67.45 లక్షల పరిహారం అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. బాధితులకు ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ, సహాయ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో పరిష్కారం సాధ్యమైన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, కమిటీ సభ్యులు సూచించిన అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు.

మిగతా 2లో..

వృద్ధాప్యం శాపంగా మారొద్దు

- డాక్టర్ అనితా రెడ్డి

హనుమకొండ, ఆయుధం: వృద్ధాప్యం ఎవరికీ శాపంగా మారకూడదని సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అంతర్జాతీయ వయోవృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని ZP ఆవరణలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ హల్ నందు సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ హన్మకొండ ఆధ్వర్యంలో ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చంద్రమౌళి అధ్యక్షత వహించగా.. డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ ఆక్ట్ 2007 మరియు రూల్స్ 2011 గురించి వివరించారు , వయో వృద్ధులకు వరం ట్రిబ్యునల్ బెంచ్ అని వయోవృద్ధులకు ఏ సమస్యలు లేదా వేధింపులకు గురైనా ట్రిబ్యునల్ బెంచ్ ని సంప్రదించాలని, వృద్ధాప్యము ఎవరికి శాపంగా మారకూడదని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. వయోవృద్ధుల చట్టంలో మరిన్ని మార్పులు చేర్పులు రావాలని, గ్రామ స్థాయిలో ఈ చట్టం గురించి మరింత ప్రచారం ప్రభుత్వం నిర్వహించాలని అన్నారు. వయోవృద్ధులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు. ప్రతి వయోవృద్ధులను పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీనియర్ సిటిజన్స్ కి వరం ట్రిబ్యునల్ బెంచ్ అన్నారు, సీనియర్ సిటిజన్స్ కి ఏ సమస్యలు వచ్చినా ట్రిబ్యునల్ బెంచ్ కి ఫిర్యాదు చేయాలన్నారు, తమకు ఏ చట్టాలు ఉన్నాయి అని తెలిసి కొని తమహక్కులు వినియోగించు కోవాలని, బ్రతికి ఉండగా పిల్లలకు పూర్తిగా ఆస్తులన్నీ పంచకూడదని తమ అవసరాలకు ఉంచుకోవాలని.. తదనంతరం చెందేలా విల్లు రాయాలని అన్నారు వృద్ధులను గౌరవించడం, ప్రేమించడం మన సంస్కారానికి నిదర్శనం అన్నారు. తల్లి దండ్రులను ప్రేమించని వారు, ఇబ్బంది పెట్టే వారు ఎంతటి కోటీశ్వరులైన దరిద్రులతో సమానం అని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ఏది ఏమైనా తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదేనని మరువ కూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, చంద్రమౌళి, దేవాచారి, రామమూర్తి, పి.వి.శ్రీనివాస్, చంద్రజిత్ రెడ్డి, యుగెందర్, దామోదర్, సరళ, పొన్నాల రాంమోహన్, సంయుక్త, డాక్టర్ ఉష తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ పంథాలో దేశాభివృద్ధి

- ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్. వి.ఎస్ ప్రభాకర్

వరంగల్, ఆయుధం: నరేంద్ర మోడీ ప్రభుత్వంలో స్కిల్ ఇండియా, మేడిన్ ఇండియా స్వచ్ఛభారత్, డిజిటల్ ఇండియా పరిరక్షణ దేశంలో జాతీయ ఉద్యమాలుగా సాగాయని బీజేపీ నేత, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్. వి.ఎస్. ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పదవి కాలం పూర్తి చేసుకున్నందుకు వరంగల్ తూర్పు నియోజకవర్గం హంటర్ రోడ్ లోని శ్రీ కన్వెన్షన్ లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్ ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, బిజెపి శ్రేణులు, కార్యకర్తలు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టే విధంగా చర్యలు ఉంటాయని విమర్శించారు. కానీ, బీజేపీ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క ప్రభుత్వాన్ని కూడా పడగొట్టిన దాఖలాలు లేవన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వంలో స్కిల్ ఇండియా, మేడిన్ ఇండియా స్వచ్ఛభారత్ డి డిజిటల్ ఇండియా పరిరక్షణ జాతీయ ఉద్యమాలుగా సాగాయని పేర్కొన్నారు. పలు దేశాలు గుడులపై దాడులు చేస్తే, సంస్కృతిక అభివృద్ధి చేసే విధంగా అయోధ్య, ఎవరు ఊహించని విధంగా పలు కార్యక్రమాలను చేపట్టారన్నారు. గంగను శుద్ధిచేసి పలు రాష్ట్రాలకు పారే విధంగా అభివృద్ధిని చేశామని తెలిపారు. ఓంకారంతో ప్రారంభమైయ్య యోగాని ప్రధాని మోదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం చేశారని కొనియాడారు. ఉగ్రవాదులను ఉగ్రవాద స్థానాలను లేకుండా చేసిన వ్యక్తి మోడీ అన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. 25 కోట్లకు పైగా ప్రజలు దారిద్ర్య రేఖనుండి ఎగువకు వచ్చారని పేర్కొన్నారు. ఆదివాసులు గిరిజనుల కోసం సమ్మక్క సారక్క విశ్వవిద్యాలయం కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మించారని వెల్లడించారు. మామునూరు విమానాశ్రయమానికి కేంద్ర ప్రభుత్వ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. వరల్డ్ హెరిటేజ్ లో వరంగల్ రామప్పని గుర్తించారని తెలిపారు. వికసిత్ భారత్‌లో భాగంగా రాష్ట్రంలో ఏ పాలన ఉన్న అభివృద్ధిలో అన్ని రాష్ట్రాలు పాల్గొనాలని చెప్పిన వ్యక్తి మోడీ అని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, జిల్లా మీడియా ఇన్ఛార్జి దశమంత రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, ప్రోగ్రాం కన్వీనర్ కనుకుంట్ల రంజిత్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్, కుసుమ సతీష్, రత్నం సతీష్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు బైరి నాగరాజు, జిల్లా కార్యదర్శులు గోకే వెంకటేష్, పోనుగోటి వెంకట్, అంకాల జనార్దన్, నోముల రతన్, జిల్లా నాయకులు మాచర్ల దీన్ దయాల్, ఎరుకుల రఘునారెడ్డి, మాదాసు రాజు, బైరీ శ్యాంసుందర్, కూచన క్రాంతి కుమార్, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.



ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

- ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేయాలి
- ప్రజావాణిలో 263 దరఖాస్తుల స్వీకరణ
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

బద్రీనాథ్ ఆలయానికి ముకేశ్ అంబానీ రూ.10 కోట్ల విరాళం

జాతీయం, ఆయుధం: రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ ప్రముఖ పుణ్యక్షేత్రం బద్రీనాథ్ ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు బద్రీనాథ్‌కేదార్‌నాథ్ ఆలయ కమిటీ (బీకేటీసీ) స్వాగతం పలికింది. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వహణకు రూ.10 కోట్లను విరాళంగా ప్రకటించారు.

ముకేశ్ అంబానీ తన కుటుంబ సభ్యులలో కలిసి తొలుత బద్రీనాథ్ ఆలయాన్ని సందర్శించారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం కేదార్‌నాథ్ ఆలయానికి వెళ్లారు. ఆలయాభివృద్ధికి, యాత్రికులకు మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు ఆయన రూ.10 కోట్లను విరాళంగా ప్రకటించారని బీకేటీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సోహన్ సింగ్ రానా తెలిపారు. ఏటా బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలను ముకేశ్ అంబానీ సందర్శిస్తుంటారు.

2 లో

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

వోపా ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానం

- హాజరైన ఎమ్మెల్సీ మధుసూదనా చారి, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

హనుమకొండ, ఆయుధం: విశ్వబ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (వోపా) వరంగల్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. హనుమకొండ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలోని ధ్యానమంటపంలో అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరామోజు నాగరాజారావు అధ్యక్షతన 2026 సంవత్సరంలో పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, 80 సంవత్సరాలు దాటిన వారికి సహస్ర చంద్ర దర్శన పురస్కారాలు, మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు స్త్రీ శక్తి పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ తొలి శాసనసభాపతి, శాసనమండలిలో బీఆర్ఎస్ ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా అతిథులు, నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మధుసూదనా చారి మాట్లాడుతూ ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేసే విధంగా ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు ఇప్పటి నుండే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ప్రణాళిక బద్ధంగా ఆ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు సామాజిక స్పృహతో ముందుకు సాగాలని హితువు పలికారు.ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రతిభా పురస్కారాలు అందజేయడం శుభపరిణామం అని, ఇందుకు గాను అవసరమైతే నా వంతు సహకారం కూడా రాబోయే కాలంలో అందిస్తానని అన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రధానం చేశారు. నిర్వాహకులు ఎమ్మెల్సీ మధుసూదనా చారిని, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వోపా రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణాచారి, రాష్ట్ర సలహాదారులు చొల్లేటి కృష్ణమాచార్యులు, రాష్ట్ర కో కన్వీనర్ కట్ట విష్ణువర్ధన్, అసోసియేట్ అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శి మహేశ్వరం బిక్షపతి, ఉపాధ్యక్షులు ఆకోజు సురేందర్ రావు, డాక్టర్ వంగాల శాంతి కృష్ణ ఆచార్య, మారేడోజు సదానందచారి, జల్లిపల్లి పెంటయ్య చారి, డాక్టర్ అనసూరి చంద్రమౌళి, డాక్టర్ పొలాస రమేష్, మట్టెవాడ విజయ్ కుమార్, డాక్టర్ శ్రీనివాస చారి, యుగేందర్, రావులకొలను రామ మూర్తి, సంగోజు రవి, శ్రీరామోజు నాగసోమేశ్వర చారి, రాగి రవీందర్, పొన్నోజు ప్రవీణ్, వీణవంక సదానందం, పెందోట సురేష్ కుమార్, మహారాజు భరత్ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మెట్రో సమస్యకు కిషన్ రెడ్డే కారణం

(మొదటి పేజీ తరువాయి..)

చెప్పారని ఆరోపించారు. కిషన్‌రెడ్డి ఖట్టర్, అశ్వినీకి చెప్పాకే సెకండ్ ఫేజ్‌కు నిధుల విషయంలో ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు.

కేసీఆర్‌కు గురుదక్షిణ

గతంలో కిషన్‌రెడ్డిని కేసీఆర్ ఏమని తిట్టారో ప్రజలందరికీ తెలుసునని సీఎం తెలిపారు. ఐఆర్ఎఫ్‌సీ నుంచి రుణ నిధులు ఇంకా ఎందుకు మంజూరు కాలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హామీ ఇచ్చినా కూడా లోన్ డబ్బు ట్రాన్స్‌ఫర్ కాలేదని, ఐఆర్ఎఫ్‌సీ లోన్ మంజూరు చేయకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని ఆరోపించారు. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్‌లో ఉన్నది కిషన్‌రెడ్డికి బాధ్యత లేదా? అని నిలదీశారు. కిషన్‌రెడ్డి, కేసీఆర్, కేటీఆర్ కలిసి మెట్రో ఫేజ్ 2ను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కేసీఆర్ సహకరించినందుకు కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారని విమర్శించారు.

కిషన్‌రెడ్డి ఇంటి ముందు ధర్నా చేద్దామా? :

మెట్రో బదిలీని చాలా కష్టపడి ఒక కొలిక్కి తీసుకువచ్చామన్న రేవంత్ రెడ్డి.. ప్రజలు ప్రజా రవాణా వ్యవస్థను ఎక్కువగా వాడుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. మరి మెట్రో విస్తరణకు మాత్రం కేంద్రం ఎందుకు సహకరించట్లేదని నిలదీశారు. మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్టు కేంద్రం వద్దే ఆగి ఉందని విమర్శించారు. ఇటీవల అన్ని రాష్ట్రాలకు అనుమతి ఇచ్చి హైదరాబాద్‌కు ఆపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అహ్మదాబాద్, విశాఖ మెట్రోకు అనుమతి ఇచ్చి హైదరాబాద్‌ను ఆపారని తెలిపారు. తెలంగాణపై కేంద్రం తీవ్రమైన వివక్ష కొనసాగిస్తోందని మండిపడ్డారు. మెట్రో అనుమతుల కోసం కిషన్‌రెడ్డి ఇంటి ముందు ధర్నా చేద్దామా? అని అడిగారు. కిషన్‌రెడ్డి వెనుక ఎవరున్నారో తాను నేరుగా చెప్పట్లేదని అన్నారు. కిషన్‌రెడ్డి కేబినెట్ మంత్రి కాబట్టి ఆయనకే ఎక్కువ బాధ్యత ఉందని హితవు పలికారు.

రాజీనామా చేస్తే మేము కూడా చేస్తాం :

బీజేపీ ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు ప్రధాని మోదీ రాజీనామా చేస్తారా? సీఎం నిలదీశారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని, ప్రతి ఒక్కరి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని మోదీ అన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్ ప్రకటించారని, ఇంకా సాకారం కాలేదని తెలిపారు. అన్నింటికి బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేస్తే తాము కూడా చేస్తామని ప్రకటించారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో

జాప్యానికి తావివ్వొద్దు

- **ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి**
- **నేటి ప్రజావాణిలో మొత్తం 263 దరఖాస్తుల స్వీకరణ**
- **కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

హనుమకొండ, ఆయుధం: ప్రజావాణి కార్యక్రమంలో అందిన పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ప్రజల నుంచి అందిన దరఖాస్తుల నమోదు, పరిష్కార ప్రక్రియపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన వెంటనే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. దరఖాస్తుల నమోదు కోసం అవసరమైతే అదనపు కంప్యూటర్లు, సిబ్బంది ఏర్పాటు చేసి రసీదుల జారీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ముగిసిన అనంతరం కూడా రసీదుల కోసం అర్జీదారులు నిరీక్షించాల్సిన పరిస్థితి లేకుండా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించిన మొత్తం 263 దరఖాస్తులు అందాయి. అలాగే జిల్లా పరిధిలోని హనుమకొండ, పరకాల రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవోలు, సంబంధిత అధికారులు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, జడ్పీ సీఈఓ శేషాద్రి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు

(మొదటి పేజీ తరువాయి..)

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అట్రాసిటీ ఘటనలకు సంబంధించిన అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. ప్రతి నెల నిర్వహించే సివిల్ రైట్స్ డే కార్యక్రమాల్లో తహసీల్దార్లు, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది తప్పనిసరిగా పాల్గొని ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంచాలని సూచించారు. ఏసిపి లు మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల విషయంలో పోలీసు శాఖ వేగంగా స్పందిస్తూ దర్యాప్తు, ఎఫ్ఐఆర్‌లు, చార్జిషీట్లు, విచారణలో ఉన్న కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. బాధితులకు న్యాయం అందేలా చట్టపరమైన చర్యలను మరింత వేగవంతం చేస్తున్నామని చెప్పారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి సురేష్ కుమార్, ఏసీపీలు ప్రశాంత్ రెడ్డి, నరసింహారావు, ఆర్డీవోలు వెనటేశ్, వెంకన్న, తహసీల్దార్ సీహెచ్ రాజు, ఎన్జీవో ప్రతినిధులు డాక్టర్ పి. దామోదర్, పురుషోత్తం, నరసింహారావు, ఈవీ శ్రీనివాస్, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి మహాప్రభో..

- **ప్రభుత్వాన్ని ఆ వృద్ధ దంపతుల వేడుక**

కామారెడ్డి, ఆయుధం: కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల్ ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన ఇరుమ లక్ష్మిరాజయ్య ఆ వృద్ధ దంపతులకు బతుకుచిత్రం చూస్తే ఎవరికైనా కన్నీళ్లు ఆగవు. అది ఇల్లు కాదు మూడు కర్రల మధ్యన కట్టిన ప్లాస్టిక్ తాటిపత్రి. అది కాస్త గట్టిగా గాలి వీచిన ఎగిరిపోయే ఆ ప్లాస్టిక్ కవర్ కిందే ఆ వృద్ధ దంపతులు జీవనం సాగిస్తున్నారు. ఒకవైపు కడు పేదరికం.. మరోవైపు అనారోగ్యంతో వృద్ధాప్యం వెంటాడుతున్నా తల దాచుకోవడానికి కనీసం ఒక చిన్న గూడు కూడా లేక ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

బడి ఆవరణను ఊడుస్తూ..

వయస్సు పై పడటంతో వీరికి కూలీ పనులు చేసే ఓపిక లేదు. వీరికి తోడుగా ఒక మనవరాలు ఉంది. ఆ పాప బాధ్యత కూడా ఈ వృద్ధులపైనే పడింది. ఆ గ్రామంలోని ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజనమే ఈ వృద్ధ దంపతులకు ఆకలి తీరుస్తుంది. ప్రతిరోజు ఉదయాన్నే లేచి ఆ బడి ఆవరణను ఊడుస్తూ కాలం గడుపుతున్నారు. సొంతగా ఒక చిన్న గూడు కట్టుకోవాలని ఉన్న రూపాయి పెట్టే స్థోమత వీరికి లేదు. అందుకే ప్రభుత్వం తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తారేమో అని వారు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తే ఎలాగో డబ్బులు వస్తాయి ఆ వచ్చే డబ్బులను నమ్ముకొని.. ఎవరైనా పెద్దమనసున్న దాతలు ముందుకు వచ్చి ఒక్క రూపాయి అయినా సాయం చేయక పోతారా? ముందుకు వచ్చి మాకు ఒక చిన్న గది అయినా కట్టించి ఇవ్వకపోతారా.? అని ఆ వృద్ధ దంపతులు వేచి చూస్తున్నారు. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయిస్తే ఎవరైనా ముందుకొచ్చి మాకు ఒక గది అయినా పూర్తి చేసి ఇస్తే.. ఈ తాటిపత్రి నరకం నుంచి బయటపడి ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటాం అంటూ ఆ వృద్ధులు కన్నీళ్ళతో వేడుకుంటున్నారు.

పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రజా ప్రభుత్వం

- **106 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**
- **ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

హనుమకొండ, ఆయుధం: ప్రజా ప్రభుత్వంలో ప్రతి అర్హులైన కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 106 మంది లబ్ధిదారులకు రూ.1,06,12,296 విలువగల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.



పశ్చిమ నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలులో పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తున్నామని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి నెల రెండు పర్యాయాలు సీఎం సహాయనిధి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని లేదా తమ డివిజన్లలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి మధ్యవర్తులు, దళారులను నమ్మవద్దని, ప్రతి పథకం పూర్తిగా ఉచితంగానే అమలు అవుతోందని స్పష్టం చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియ ఈ నెలలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి పౌరుడు తన ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించి నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందడంలో భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవడం అవసరమని తెలిపారు. ప్రజలు ఓటరు నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతాయుతంగా పాల్గొనాలని కోరారు. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరే వరకు ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేస్తారని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పాఠశాలలో అల్పాహారం ప్రారంభం

వరంగల్, ఆయుధం; రాష్ట్రంలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా గిర్మాజిపేట హైస్కూల్ కొత్తవాడ లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విద్యార్థిని విద్యార్థులకు ప్రవేశపెట్టిన పౌష్టిక అల్పాహారం కార్యక్రమాన్ని టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత ప్రారంభించారు. పాఠశాలకు విచ్చేసిన విద్యార్థిని,విద్యార్థులకు స్వాగతం పలకడం, తదనంతరం విద్యార్థులందరికీ కూడా పౌష్టిక అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ, వారి తల్లిదండ్రులు తెలంగాణా ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి, దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

- **పల్స్ పోలియో, స్టాప్ డయేరియా, జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలను సక్సెస్ చేయాలి**
- **జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

హనుమకొండ, ఆయుధం: పోలియో నిర్మూలనతో పాటు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా చేపడుతున్న పల్స్ పోలియో, స్టాప్ డయేరియా క్యాంపెయిన్, జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్, ఆయా కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 05 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా వలస కార్మికులు నివసించే ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాలు వంటి అధిక ప్రమాద ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ట్రాన్సిట్ పాయింట్లతో పాటు అన్ని పోలియో కేంద్రాల్లో పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్యక్రమం విస్తృతంగా జరిగేలా స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీవోలు భాగస్వామ్యం కావాలని కోరారు. జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి, 05 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డయేరియా, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచాలని తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్లు పెంపొందించేందుకు భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాం కుమార్ మాట్లాడుతూ.., జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో జిల్లాలోని 84,298 మంది 05 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 472 పోలియో బూత్‌లు, మొబైల్ బృందాలు, ట్రాన్సిట్ పాయింట్లు, అధిక ప్రమాద ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి మాట్లాడుతూ, జూన్ 15 నుంచి జూలై 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 13, 20 తేదీల్లో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించి, ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులందరికీ ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, డి ఆర్ ఓ శ్రీనివాస్, జెడ్పి సీఈఓ శేషాద్రి పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ, విద్యాశాఖ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ విత్ మిల్క్ షురూ

వరంగల్, ఆయుధం; ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు "బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్" కార్యక్రమం ప్రారంభమైంది. సోమవారం పాఠశాల మొదటి రోజు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన "బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్" కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు. విద్యార్థులకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, విద్యాభివృద్ధికి తోడ్పడే ఈ కార్యక్రమం అభినందనీయమని నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. "ఆరోగ్యవంతమైన విద్యార్థి - అభివృద్ధి చెందిన సమాజానికి పునాది." విద్యార్థుల సంక్షేమమే మనందరి లక్ష్యం అని పేర్కొన్నారు.

యువతకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం విఫలం

- **ఎఐవైఎఫ్ తెలంగాణ అధ్యక్షులు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి**

హనుమకొండ, ఆయుధం: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి ఆరోపించారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎఐవైఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం హనుమకొండ జిల్లా స్థాయి విస్తృత సమావేశం గిన్నారపు రోహిత్ అధ్యక్షతన జరగగా ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ నిరుద్యోగ యువత జీవితాలను అంధకారంలోకి నెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లక్షలాది మంది యువత ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, ప్రభుత్వం నియామక ప్రక్రియలను వేగవంతం చేయడంలో విఫలమైందన్నారు. నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతుండగా, యువతలో నిరాశ, నిస్పృహ పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో విద్యార్థులు, తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ట్యూషన్ ఫీజులతో పాటు అడ్మిషన్ ఫీజులు, ప్రత్యేక ఫీజులు, ఇతర అదనపు రుసుముల పేరుతో విద్యను వ్యాపారంగా మార్చారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర వైద్య రంగ పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారిందన్నారు.

నూతన జిల్లా కమిటీ ఎన్నిక

ఎఐవైఎఫ్ హనుమకొండ జిల్లా నూతన కమిటీని అధ్యక్షుడుగా నార్లాపురం రాజు, జిల్లా కార్యదర్శిగా గిన్నారపు రోహిత్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా గుగులోత్ సురేష్, ఉపాధ్యక్షులు గా కేతపాక ప్రసాద్, పసునూరి సునీల్, సహాయ కార్యదర్శి గా షేక్ హాజీ ను, కోశాధికారిగా ఈదునూరి కళ్యాణి ని లతో పాటు మొత్తం జిల్లా కమిటీ సభ్యులను 21 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఎఐవైఎఫ్ మాజీ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మాస్కా సుదీర్, ఎఐవైఎఫ్ నాయకులు గుగులోత్ సురేష్, కేతపాక ప్రసాద్, షేక్ హాజీ, తాటికొండ ప్రశాంత్, పూజారి నరేందర్, పెనుకుల మధు, రెసోజు రాజు, శ్రీనివాస్, కొత్తపల్లి శ్రీకాంత్, ఈదునూరి కళ్యాణి, మనుకొండ శిరీష, ఈర్ల లావణ్య, కొండోజు అలౌకిక, బోగి రమా, కవిత, పాల్గొన్నారు.

వీరబధ్రియ కుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం

వరంగల్, ఆయుధం: వరంగల్ జిల్లా వీర భద్రియ కుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా మల్లూరి రాజు, ప్రధాన కార్యదర్శిగా కందుకూరు సతీష్, కోశాధికారిగా మిట్టపల్లి రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా గుమలాపురం ఉప్పలయ్య, ఉపాధ్యక్షులు మల్లూరు బిక్షపతిని జిల్లా కమిటీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వీరబధ్రియ కుల సంఘం రాష్ట్ర నాయకులు కర్నే శివకుమార్, చెవ్వ రాజయ్య, మిట్టపల్లి చిన్న రాజమౌళి, కాటి రాములు, మిట్టపల్లి సత్తయ్య, బాణాల రాజ్ కుమార్, వరంగల్ పట్టణ సంఘం అధ్యక్షులు మిట్టపల్లి కుమార్ స్వామి, జనరల్ సెక్రటరీ కడారి చిరంజీవి, కోశాధికారి మిట్టపల్లి గంగరాజు, చెన్నారావుపేట సంఘం అధ్యక్షులు మిట్టపల్లి రాజు, నర్సంపేట కమలాపురం అధ్యక్షులు మల్లూరు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

హనుమకొండ, ఆయుధం: మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్ హనుమకొండ జన్మదినం పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు ఉపకరణాలు అందజేశారు. నూతన విద్యా సంవత్సర ఆరంభమైన రోజున విద్యార్థులకు కంపాస్ బాక్స్‌లు, పెన్సిల్స్ షార్పనర్స్, బిస్కెట్స్ అందించి అందరూ ఉన్నతంగా చదవాలని, ఎంతో ఎదగాలని ఆకాంక్షించారు. ఇంకా ఏ విధమైన సహాయం కావాలన్న చేస్తానని చెప్పారు.

పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలి

- **బి కె యం యు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు**

వరంగల్, ఆయుధం: అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినందున కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు డీజిలు వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అమెరికా ఇరాన్ మధ్యన శాంతి ఒప్పందం కుదిరి యుద్ధ వాతావరణం తొలగిపోయిన నేపథ్యంలో మార్చి లో 118 డాలర్ల వద్ద ఉన్న క్రూడ్ ఆయిల్ ధర నేడు 84 డాలర్లకు పడిపోవడంతో బ్యారెల్ కు 34 డాలర్లు తగ్గిందని అనగా 30% ధరలు తగ్గాయని అన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా తగ్గినందున ఏమాత్రం కాలయాపన చేయకుండ అంతర్జాతీయంగా తగ్గిన దరల కనుగుణంగా ధరలు తగ్గించి పేద సామాన్య మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో వారం రోజుల వ్యవధి లోనే మూడుసార్లు పెట్రోలు డీజిల్ రేట్లనూ, వంట గ్యాస్ ధరలను రెండుసార్లు అడ్డగోలుగా అంతులేకుండ పెంచడంతో దాని ప్రభావం రవాణాపై పడి నిత్యావసర వస్తువులైన బియ్యము పప్పులు నూనెలు కూరగాయలు మొదలైన వాటి ధరలు చుక్కలంటి సామాన్య ప్రజలు బ్రతుకులు దుర్భరంగా మారాయన్నారు. ఉదాహరణకు కిలో కూరగాయలు కొనుక్కునే కుటుంబం పావు కిలోనే కొనుక్కొని అర్ధాకలితో కాలం గడుపుకునే పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పేద మధ్యతరగతి సామాన్య ప్రజలపై భారాలను మోపే ఆర్థిక విధానాలను విడనాడాలన్నారు. బడా పారిశ్రామిక కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసి దేశ సంపదను వారికి దోచిపెట్టడం మానుకోవాలన్నారు. కార్మిక కర్షక శ్రమజీవుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పాలన కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. లేనిచో దేశవ్యాప్తంగా ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695